సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



క్యాంప్‌లో ఎంపీటీసీలు
నాగిరెడ్డిపేట ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడడంతో బీఆర్ఎస్ ఎంపీటీసీలు క్యాంప్‌నకు తరలివెళ్లారు.
- 8లో ▸



అంకితభావంతో పనిచేయాలి
ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ పాటిల్ పేర్కొన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.8 / 16.0

వాతావరణం
ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

బెస్ట్ అవైలబుల్ కోసం దరఖాస్తుల స్వీకరణ

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల నుంచి బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద ఎంపిక కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గాను రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ స్కూల్స్ యాజమాన్యాలు ఈనెల 27వ తేదీలోపు కలెక్టరేట్‌లోని రూం నంబర్ 113 ఎస్సీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 83280 15942 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎన్‌సీఆర్‌పీ ఫిర్యాదులను పరిష్కరించాలి

● జిల్లా న్యాయమూర్తి ఎన్ శ్రీదేవి



కామారెడ్డి టౌన్: నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌పీ) ద్వారా నమోదైన దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి జిల్లాలోని పోలీస్ శాఖ అధికారులు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కామారెడ్డి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సైబర్ క్రైం ద్వారా బాధితులు కోల్పోయిన డబ్బులను దర్యాప్తు అధికారి బ్యాంకు అధికారులకు ఇచ్చిన నోటీసు ద్వారా నిందితుడి ఖాతాలను ఫ్రీజ్ చేస్తారని తెలిపారు. ఇలాంటి కేసులను బ్యాంక్ అధికారులు, బాధితుల సమన్వయంతో కేసులను దర్యాప్తు చేసి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లా న్యాయస్థానంలో మార్చి 9న నిర్వహించే లోక్ అదాలత్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోండి

కామారెడ్డి అర్బన్: తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగాలకు నిర్వహించే ఐదు నెలల రెసిడెన్షియల్ ఫౌండేషన్ కోర్సు శిక్షణకు మార్చి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమాధికారి రజిత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో శిక్షణ పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కారని పేర్కొన్నారు. ఉచిత కోర్సుకు ఎస్సీలతో పాటు ఎస్టీ, బీసీ, మైనారిటీలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపిక కోసం మార్చి 10న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

హిస్టరీ విభాగాధిపతిగా అంజయ్య



భిక్కనూరు: తెలంగాణ వర్సిటీ సౌత్ క్యాంపస్‌లోని చరిత్ర విభాగంఅధిపతిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బందెల అంజ య్యను యూనివర్సిటీ అధికారులు నియమించారు. ఈ మేరకు శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంజయ్య చరిత్ర మాజీ విభాగాధిపతి డాక్టర్ రాజేశ్వరి నుంచి బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ హెచ్‌వోడీ హరిత, అధ్యాపకులు మోహన్‌బాబు, యాలాద్రి, సరిత పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ సర్వేను అడ్డుకున్న రైతులు

వేల్పూర్: జాతీయ రహదారి విస్తరణ సర్వేను రైతులు అడ్డుకున్నారు. 63వ నంబర్ జాతీయ రహదారిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా లక్కోర దాటిన తర్వాత పడగల్ ఒడ్డెర కాలనీ, అంక్సాపూర్, కుకునూర్ గ్రామాల మీదుగా పంట భూముల నుంచి బైపాస్ రోడ్డు వేయాలని హైవే అధికారులు ఇటీవల నిర్ణయించారు. రహదారి సర్వే నిర్వహించడానికి శనివారం హైవే పీడీ అజయ్ మణికుమార్, జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, మండల రెవెన్యూ అధికారులు పంట భూముల వద్దకు రాగా రైతులు వారిని అడ్డుకున్నారు. తమకు ఆధారంగా ఉన్న పంట భూములు రహదారిలో కలిస్తే తాము ఎలా జీవించాలని రైతులు ప్రశ్నించారు. ఇప్పటికే వరద కాలువ, రైల్వేలైను కోసం భూములిచ్చి నష్టపోయామని, తిరిగి జాతీయ రహదారి విస్తరణకు పంటభూలు కోల్పోవాలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

సండే.. ఫన్‌డే..

● కుటుంబ సభ్యులతో కాలక్షేపం
● అవకాశం దొరికితే ఫ్రెండ్స్, రిలేటివ్స్ దగ్గరికీ..
● వారానికో రోజు రిలాక్స్ అవుతున్న డాక్టర్లు

డాక్టర్లది తీరిక దొరకని జీవితం. ఊపిరిసలపనంతగా పని. ఆస్పత్రికి వచ్చే రోగులతోనే పొద్దు గడిచిపోతుంది. ఒక్కోసారి అర్ధరాత్రుల్లో ఎవరైనా పేషెంట్‌కు అత్యవసర వైద్యం అందించాల్సి ఉంటే నిద్రను వదిలి వైద్య సేవలు చేయాల్సిందే. సోమవారం ఉదయం నుంచి శనివారం రాత్రి వరకూ వైద్యుల దినచర్య ఇంచుమించు ఇలాగే ఉంటుంది. ఇంట్లో ఫంక్షన్, పెళ్లిళ్లు ఉన్నప్పుడు ఎలాగోలా నాలుగు రోజులు ఆస్పత్రికి వెళ్లడం మానుకుంటారేమోగానీ, మిగతా రోజుల్లో కచ్చితంగా విధులు నిర్వహిస్తుంటారు. ఇలా చాలా మంది వైద్యులు కుటుంబ సభ్యులతో గడిపే సమయం చాలా తక్కువ. అందుకే ఆదివారం వచ్చిందంటే చాలు ఆ పూట కచ్చితంగా భార్య, పిల్లలు, తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులతో సమయం గడిపే ప్రయత్నం చేస్తుంటారు. దాదాపు అందరూ ఫ్యామిలీకే సమయం కేటాయిస్తూ సేదతీరుతున్నారు. – సాక్షి, కామారెడ్డి



కుటుంబ సభ్యులతో కలిసి విహార యాత్రకు వెళ్లిన డాక్టర్ శ్రీనివాస్



◀ ఫ్యామిలీ టూర్‌లో డాక్టర్ శరత్‌కుమార్



కుటుంబ సభ్యులతో టూర్‌లో డాక్టర్ మల్లికార్జున్

సండే స్పెషల్

మరిన్ని అభిప్రాయాలు 8లో..

కుటుంబ సభ్యులతోనే ఉంటా



ఉద్యోగంలో చేరి ముప్పై ఏళ్లయ్యింది. రోజూ బిజీ లైఫ్. ఆదివారం ఒక్కరోజే సమయం దొరుకుతుంది. పిల్లల దగ్గరకు వెళ్లి వాళ్లతో కలిసి ఉండే ప్రయత్నం చేస్తా ను. పిల్లలతో కలిసి దగ్గరి బంధువులను కూడా కలుస్తుంటాను. అప్పుడప్పుడు ఫ్యామిలీతో కలిసి టూర్లకు కూడా వెళ్లి వస్తాను. పేషెంట్లు, ఆస్ప త్రి అంటూ బిజీ గా ఉండడం వల్ల ఒక్కరోజైనా రెస్ట్ తీసుకోవాల్సిందే. అందుకే ఆదివారం తప్పనిసరిగా కు టుంబంతో ఉండేందుకు ప్రయత్నిస్తాను.
– డాక్టర్ శ్రీనివాసప్రసాద్, ఏరియా అస్పత్రి సూపరింటెండెంట్, బాన్సువాడ

ఇంటికే పరిమితం..



సండే వచ్చిందంటే ఇంట్లో ఉండే ప్రయత్నం చేస్తాను. ఇంటికి సంబంధించిన పనులు ఏమున్నా ఆదివారం చేస్తుంటాను. కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడుపుతాను. ఫ్యామిలీ ఫ్రెండ్స్, రిలేటివ్స్ ఫంక్షన్లు ఉంటే వాటిని అటెండ్ చేయడం జరుగుతుంది. వారంలో ఒక రోజు వైద్యానికి దూరంగా ఉండడం మూలంగా కొంత రిలాక్స్ దొరుకుతుంది.
–డాక్టర్ గీరెడ్డి రవీందర్‌రెడ్డి, న్యూరో ఫిజీషియన్, కామారెడ్డి

పిల్లల దగ్గరికి వెళ్లాల్సిందే..



మా పిల్లలు జగిత్యాలలో ఉంటారు. ఆదివారం వాళ్ల దగ్గరికి వెళ్లాల్సిందే. వాళ్లతో కలిసి పిక్నిక్స్‌కు వెళ్లడం లేదంటే దేవాలయాల దగ్గరకు వెళ్తుంటా. ఆ రోజంతా వాళ్లతోనే ఉండి మండే మార్నింగ్ రిటర్న్ అవుతుంటాను. ఒక్కో సండే పేరెంట్స్ దగ్గరికి వెళ్లి వస్తుంటాను. రిఫ్రెష్‌మెంట్ అనేది ప్రతిఒక్కరికీ అవసరం. –డాక్టర్ అజయ్ పేరాలా, జనరల్ ఫిజీషియన్, కామారెడ్డి

నిజాం షుగర్స్‌పై ఆశలు

● ఫ్యాక్టరీ పున:ప్రారంభంపై స్పష్టత ఇచ్చిన పునరుద్ధరణ కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్ బాబు
● కర్మాగారాన్ని సందర్శించిన కమిటీ
● రైతులు, కార్మికులతో సమావేశం
● ఇద్దరు రైతులతోనే మాట్లాడించిన వైనం
● ప్రభుత్వం టేకోవర్ చేస్తుందా.. సహకార రంగంలో నడుపుతారా అనే దానిపై సందిగ్ధత



రైతులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి

బోధన్ : నిజాం షుగర్స్ ఫ్యాక్టరీల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంతో ఉందని ఫ్యాక్టరీల పునరుద్ధరణ కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టత ఇవ్వడంతో చెరుకు రైతులు, కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే ఫ్యాక్టరీలను ప్రభుత్వం టేకోవర్ చేసుకుని నడిపిస్తుందా.. సహకార రంగంలోనా.. లేక ప్రైవేట్ పరం చేస్తుందా అన్న విషయాలపై మంత్రి స్పష్టత ఇవ్వలేదు. ఈ విషయంలో రైతులు, కార్మికులు అసంతృప్తితో పాటు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఫ్యాక్టరీల వాస్తవ పరిస్థితుల అధ్యయనం కోసం వచ్చామని, రైతులు, కార్మికుల అభీష్టమేరకు తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిజాంషుగర్స్ ఫ్యాక్టరీల (మూసివేతకు గురైన బోధన్, ముత్యంపేట, మంబోజిపల్లి) పునరుద్ధరణకు కమిటీ వేసింది. కమిటీ చైర్మన్ అయిన రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కో చైర్మన్, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా, కమిటీలోని బోధన్, మెదక్ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, మరో నలుగురు రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులు శనివారం తొలిసారిగా బోధన్ షుగర్ ఫ్యాక్టరీ సందర్శనకు వచ్చారు.

200 మంది రైతులు, కార్మికులతో..

రైతు పునరుద్ధరణ కమిటీ ప్రతినిధులు సుమారు రెండు వందల మంది రైతులు, కార్మికులతో సమావేశం నిర్వహించగా అందులో ఇద్దరు రైతులకు మాత్రమే మాట్లాడే అవకాశం కల్పించారు. రైతులు మందర్న రవి, శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ ప్రారంభిస్తే చెరుకు సాగుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ఫ్యాక్టరీలో సందడి..

పునరుద్ధరణ కమిటీ ప్రతినిధులు, రైతులు, కార్మికులు, నాయకుల రాకగా బోధన్ షుగర్ ఫ్యాక్టరీలో సందడి కనిపించింది. 2015 డిసెంబర్ 23న లేఆఫ్ ప్రకటించి ఫ్యాక్టరీలను యాజమాన్యం మూసివేసింది. నాటి నుంచి ఫ్యాక్టరీ గేట్‌లు మూసి వేసి ఉన్నాయి. లోపలికి రైతులు, కార్మికులెవరికీ అనుమతి ఇవ్వలేదు. పునరుద్ధరణ కమిటీ రాకతో ఫ్యాక్టరీ గేట్లు తెరిచారు. దీంతో చెరుకు రైతులు, కార్మికులు సంబరపడ్డారు. ఎన్నాళ్లకెన్నాళ్లకు ఫ్యాక్టరీ గేట్లు తెరిచారని చర్చించుకున్నారు.

సహకార రంగంలో నడిపిస్తామన్న కేసీఆర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2015 జనవరిలో ప్రత్యేకంగా అప్పటి సీఎం కేసీఆర్ మూడు ఫ్యాక్టరీల చెరుకు రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు ముందుకు వస్తే ఫ్యాక్టరీలను ఆధునీకరించి సహకార రంగంలో నడిపేందుకు రైతులకు అప్పగిస్తామని, ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేసీఆర్ స్పష్టత ఇచ్చారు. అయితే రైతులు విభేదించి ప్రభుత్వమే నడపాలని తేల్చి చెప్పారు. గతం నుంచి కూడా షుగర్ ఫ్యాక్టరీలను టేకోవర్ చేసుకుని ప్రభుత్వమే నడపాలని బోధన్ ప్రాంత రైతులు, కార్మికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ వస్తున్నారు. కాగా కొందరు రైతుల్లో ఫ్యాక్టరీ తెరిపించి ఏ రంగంలోనైనా నడిపించాలనే భిన్నాభిప్రాయం కూడా ఉంది.

చెరుకు సాగుతో పాటు పున:ప్రారంభ ప్రక్రియ

● నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్‌బాబు

బోధన్ : చెరుకు సాగు, నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ పున:ప్రారంభ ప్రక్రియ సమాంతర దశలో కొనసాగాలని ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ చైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన రైతులతో నిర్వహించిన ముఖాముఖిలో మాట్లాడారు. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీలను తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, రైతుల సహకారంతో లాభాల్లో నడిపించేందుకు కసరత్తు మొదలు పెట్టామన్నారు. ప్రజాప్రతినిధులు, రైతులు, కార్మికులతో కలిసి ఫ్యాక్టరీలోని పరిసరాలను, యంత్రాలను పరిశీలించారు.

చెరుకు పండించే రైతులకు పర్చేజ్ ట్యా క్స్, విత్తన రాయితీ, ట్రాన్స్‌పోర్టు సబ్సిడీ, కొత్త వంగడాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. షుగ ర్ ఫ్యాక్టరీ మూతపడి పదేళ్ల కావస్తున్నా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికుల సంక్షేమం పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. ఫ్యాక్టరీ భూములను బ్యాంకుల్లో కుదవ పెట్టారని, బ్యాంక్ రుణాల సమస్యను అధిగమించాల్సి ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసి పోయిందని ఆరోపించారు. రైతు బంధు సాయం ఐదు ఎకరాలకే పరిమితం చేయాలని అభిప్రాయాలు పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు.

అమ్మకానికి ఆడబిడ్డ

● గమనించి తండ్రిని పోలీసులకు అప్పగించిన వైద్యుడు

బాన్సువాడ రూరల్: కన్నపిల్లల్ని పోషించే స్థోమత, బాధ్యత లేని ఓ తండ్రి తన ఏడాది కూతురును అమ్మడానికి సిద్ధపడ్డాడు. ఈ ఘటన బాన్సువాడలోని మాతాశిశు ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాన్సువాడ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ వ్యక్తి తన భు జాలపై ఓ పసిపాపను ఎత్తుకుని అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో గమనించిన ఆ స్పత్రిలోని డ్యూటీ డాక్టర్ కాళిదాస్ ఆ వ్యక్తిని ప్రశ్నించాడు. దీంతో అనుమానితుడు తన పే రు విస్లావత్ శ్రీను అని, తనది సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ అని తెలిపాడు. తనకు ముగ్గురుకు మార్తెలు ఉన్నారని, ఏడాది క్రితం తన భార్య చ నిపోవడంతో చిన్నారిని పోషించే స్థోమత లేక ఎవరికైనా అమ్మడానికి తెచ్చినట్లు తెలిపాడు. దీంతో వైద్యుడు బాన్సువాడ పోలీసులకు స మాచారం అందించగా వారు శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిని స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. వైద్యుడు కా ళిదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సారంగాపూర్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ సహకార(సారంగాపూర్) చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలని మంత్రి శ్రీధర్‌బాబుకు సారంగాపూర్ చెరుకు ఉత్పత్తిదారుల సంఘం, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయనను కలిసి ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కోరారు.

సొంత గూటికి రాజేశ్వర్!

● బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ
● పార్లమెంట్ ఎన్నికల ముందు మారుతున్న రాజకీయాలు
● అదే బాటలో మరికొందరు నేతలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ డి రాజేశ్వర్

సాక్షి, కామారెడ్డి : మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్‌రావ్ సొంత గూటికి చేరారు. దాదాపు పదేళ్ల పాటు బీఆర్ఎస్‌లో కొనసాగిన ఆయన శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడిగా పేరున్న రాజేశ్వర్‌ను 2005లో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో శాస న మండలి సభ్యుడిగా నియమితులై ఆరేళ్ల పాటు పనిచేశారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన రాజేశ్వర్‌కు వరుసగా రెండు సార్లు ఎమ్మెల్సీగా అవకాశం రావడంతో 2023 వరకు కొనసాగారు. తర్వాత క్రిష్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై ఇటీవల రద్దయ్యే వరకు కొనసాగారు. దళితులు, క్రిస్టియన్ వర్గాల్లో రాజేశ్వర్‌కు మంచి పట్టుంది. కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ నియోజక వర్గంలో 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అప్పటి నుంచి నియోజక వర్గంలోని వివిధ వర్గాలతో సన్నిహిత సంబంధాలున్నాయి. తిరిగి పోటీ చేయడానికి ప్రయత్నించినా టిక్కెట్ లభించలేదు. అయితే దివంగత సీఎం వైఎస్సార్ రాజేశ్వర్‌కు నామినేటెడ్ పదవులు ఇచ్చి ప్రోత్సహించారు. దీంతో వరుసగా మూడు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేసే అవకాశం వచ్చింది.

పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌కు దెబ్బ

వారం పది రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న సమయంలో రాజేశ్వర్ బీఆర్ఎస్‌ను వీడడం ఆ పార్టీకి షాక్‌గా భావిస్తున్నారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో దళితులు, క్రిస్టియన్ వర్గాలతో రాజేశ్వర్‌కు మంచి సంబంధాలున్నాయి. ఆయనకు ఉమ్మడి జిల్లాలోనూ చాలా పరిచయాలున్నాయి. కార్మిక వర్గాల్లోనూ ఆయనకు పట్టుంది. పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలని జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటికే తమ కార్యాచరణ మొదలుపెట్టాయి. ఇరు పార్టీలు అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి.

అయితే బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ పోటీ చేయడంపై సందిగ్ధంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా పార్లమెంట్ ఎన్నికలకు ముందు రాజేశ్వర్ పార్టీని వీడడం ఆ పార్టీకి దెబ్బేనని భావిస్తున్నారు. ఇదే సమయంలో మరికొందరు నేతలు అదే దారిలో నడుస్తారన్న ప్రచారం జరుగుతోంది.

పాస్‌పోర్టు సేవలు తాత్కాలికంగా నిలిపివేత

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పాస్‌పోర్టు సేవా కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కామారెడ్డి పోస్టల్ అధికారి రాజు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డి సేవా కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా ఈనెల 26 నుంచి ఉన్న అపాయింట్‌మెంట్లను రద్దు చేస్తూ.. రీషెడ్యూల్ తేదీల సమాచారాన్ని మేసేజ్‌ల ద్వారా దరఖాస్తుదారులకు తెలుపుతామన్నారు. నిజామాబాద్‌లోని పాస్‌పోర్టు సేవా కేంద్రంలో అదనపు అపాయింట్‌మెంట్లను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు వారి సౌలభ్యం, లభ్యత ఆధారంగా తెలంగాణలోని పాస్‌పోస్టు సేవా కేంద్రాల్లో అపాయింట్‌మెంట్లను రీషెడ్యూల్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ప్రజలు దరఖాస్తుదారులు సహకరించాలని కోరారు.



ప్రమాదంలో కాలిబూడిదైన సామగ్రి

మత్తు పదార్థాల నివారణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: మత్తు పదార్థాలను నియంత్రించడానికి కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తుకు యువత, విద్యార్థులు ఎంతో ముఖ్యమన్నారు. అలాంటి యువతను పెడదారి పట్టించే మత్తు పదార్థాలు రవాణా కాకుండా చూడాలన్నారు. సమాజానికి ప్రమాదకరంగా మారిన మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపడానికి ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ బావయ్య, డీఏవో భాగ్యలక్ష్మి, డీటీవో శ్రీనివాస్ రెడ్డి, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

లెండి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలి



మహారాష్ట్ర అధికారులతో సమీక్షిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్ట్ పనులకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అధికారులను ఆదేశించారు. శనివారం ప్రాజెక్ట్ పనులపై మహారాష్ట్ర నీటిపారుదల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెండి పనులకు నిధులు ఇవ్వాలని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించగా రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. 2003 సంవత్సరంలో ప్రారంభించిన లెండి కాల్వలు, ప్రాజెక్టు నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందన్నారు. 2016 నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున నిధులు మంజూరు చేయించి పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో దెగ్లూర్ నీటి పారుదలశాఖ ఈఈ వైజెకానాథ్, జేఈ ప్రశాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటికోసం తిప్పలు



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో వాటర్ ప్యూరిఫైయర్ లేకపోవడంతో బయటి నుంచి మినరల్ వాటర్ తెప్పిస్తున్నారు. అయితే విద్యార్థులకు అందించే అల్పాహారంలో కోత విధించి దానికి అయ్యే ఖర్చు పెడుతున్నారు. దీంతో విద్యార్థులకు ఓ వైపు అల్పాహారం కోసం, మరోవైపు నీటికోసం తిప్పలు తప్పడం లేదు. అధికారులు స్పందించి వాటర్ ప్యూరిఫైయర్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. దాతలు ముందుకురాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఎల్లారెడ్డికి చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు



ఎల్లారెడ్డి : ఈనెల 28 నుంచి నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు చేరినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్ తెలిపారు. ఈనెల 28 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని వీటికి సంబంధించి మూడు సెట్ల ప్రశ్నాపత్రాలు వచ్చాయన్నారు. వీటిని పోలీస్ స్టేషన్‌లో భద్రపర్చినట్లు ఆయన తెలిపారు.

క్రీడల ద్వారానే మానసిక ఉల్లాసం



బీబీపేట : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్ అన్నారు. శనివారం తుజాల్పూర్ గ్రామంలో ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలమణి తేలు సత్యనారాయణ, స్వామి, ప్రసాద్, తిరుపతి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి అర్బన్: అవుట్ సోర్సింగ్ సిబ్బంది అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావడంతోపాటు ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్, జేసీ చంద్రమోహన్ సూచించారు. శనివారం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించిన అనంతరం కలెక్టరేట్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జేసీ మాట్లాడుతూ.. కష్టపడి పనిచేస్తే ప్రభుత్వం తప్పకుండా గుర్తిస్తుందన్నారు. పే స్కేల్, ఏజెన్సీ విధానం రద్దు చేయాలని అవుట్‌సోర్సింగ్ జేఏసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అరుణ్‌కుమార్, నాయకులు అనిల్‌కుమార్, రాజేందర్, రాజ్‌కుమార్, అంజయ్య, అనుసూయ తదితరులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

నూతన కార్యవర్గం

జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అల్లావుద్దీన్, ఉపాధ్యక్షులుగా పద్మ, అంజయ్య, జగన్, కన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, మహిళా కార్యదర్శిగా లక్ష్మి, అనుసూయ, సంయుక్త కార్యదర్శులుగా ఇక్రమ్, మునీర్, రమేశ్, రాజు, దినేశ్, ఇమ్రాన్, కోశాధికారిగా రాజేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఆయాజ్, అఖిల్, భాస్కర్, శంకర్, సలహాదారులుగా రాజ్‌కుమార్, గోపికృష్ణ, మీడియా ఆర్గనైజర్‌గా మల్లికార్జున్, కార్యవర్గ సభ్యులుగా ఇఫ్తాకర్, రాజేశ్వర్, శ్రీనివాస్, శ్రీధర్ ఎన్నికయ్యారు.

క్యాంప్‌లో బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు

- రసవత్తరంగా నాగిరెడ్డిపేట రాజకీయం



నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల కావడంతో మండలంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. రాఘవపల్లి ఎంపీటీసీ స్థానం ఖాళీగా ఉంది. ప్రస్తుతం 9మంది ఎంపీటీసీలున్నారు. ఇన్‌చార్జి ఎంపీపీ దివిటి రాజ్‌దాస్ స్వతంత్ర అభ్యర్థి కాగా, మిగిలిన 8మంది ఎంపీటీసీలు బీఆర్‌ఎస్‌కు చెందినవారు. కాగా, పోచారం ఎంపీటీసీ టేకుల పల్లి వినీత మొదటి నుంచి ఎంపీపీ పదవిని ఆశిస్తున్నప్పటికీ ఆమె ప్రయత్నాలు ఫలించలేదు. ప్రస్తుతం ఎంపీపీ ఎన్నిక మరోసారి తెరపైకి రావడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. మొత్తం ఎనిమిది మంది బీఆర్‌ఎస్ ఎంపీటీసీలకుగాను ఏడుగురు శిబిరానికి తరలివెళ్లారు. మరోవైపు ప్రస్తుత ఇన్‌చార్జి ఎంపీపీ రాజ్‌దాస్ తన కుర్చీని కాపాడుకునేందుకు తన ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్క ఎంపీటీసీ లేని అధికార కాంగ్రెస్ ఎవరికి మద్దతు తెలుపుతుందనే దానిపై మండల ప్రజల్లో ఆసక్తి నెలకొంది. బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీటీసీల్లో ఎవరినైనా కాంగ్రెస్‌లోకి ఆహ్వానించి వారికి మద్దతు ఇస్తుందా? లేక ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి ఎంపీపీ రాజ్‌దాస్‌కు మద్దతు ఇచ్చి ఆయనకు అనుకూలంగా పావులు కదుపుతుందో వేచి చూడాలి.

29న జాబ్‌మేళా



బాన్సువాడ రూరల్ : మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఇందూరు గంగాధర్ తెలిపారు. యాక్సిస్ బ్యాంక్, ప్రో మైండ్స్ స్కిల్ క్యాటలిస్ట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. జాబ్‌మేళా ద్వారా డిజిటల్ ఆఫీసర్, కస్టమర్ సేల్స్ అడ్వర్టైజ్‌మెంట్, టీఎల్ పొజిషన్ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. జాబ్‌మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. 99481 77361లో సంప్రదించాలన్నారు.

కళ్లకు గంతలతో అయోధ్యకు పయనం



కామారెడ్డి టౌన్: మెజీషియన్లు కళ్లకు గంతలు కట్టుకుని హైదరాబాద్ నుంచి అయోధ్యకు బైక్‌లపై వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి మోటార్‌సైకిళ్లపై బయల్దేరిన మెజీషియన్లు శనివారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. మోటార్‌సైకిల్ యాత్రకు బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. కళ్లకు గంతలు కట్టుకుని మోటార్‌సైకిల్‌యాత్ర చేపట్టిన మెజీషియన్లు మారుతిజోషి, రామకృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయోధ్యలో బాలరాముడిని దర్శించుకోవాలని ఈనెల 23న హైదరాబాద్ నుంచి బయల్దేరినట్లు తెలిపారు. కళ్లకు గంతలు కట్టుకొని బైక్‌పై అయోధ్య వరకు యాత్ర కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పేదరికాన్ని నిర్మూలించాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి సుధాకర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : సమాజంలోని పేదరికాన్ని నిర్మూలించాలని కామారెడ్డి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. మహిళల హక్కులు, చట్టాలు, లీగల్ సర్వీసెస్ సేవలపై అవగాహన కల్పించారు. చదువుతో పేదరికాన్ని నిర్మూలించొచ్చని, బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్‌బీ రమేశ్‌చంద్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మోహన్‌రావు, తాడ్వాయి ఏఎస్సై సంజీవులు, జిల్లాన్యాయసేవ సంస్థ సిబ్బంది సాయి ప్రణీత్, సాయికృష్ణ, నరసింహ, ఏపీఎం రవీందర్, సీసీలు గ్రామసమాఖ్య అధ్యక్షురాలు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి నాగరాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన న్యాయచైతన్య సదస్సులో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో సౌకర్యాలు, సమస్యలపై విద్యార్థినులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉందని విద్యార్థినులు తెలిపారు. పాఠశాల ప్రత్యేకాధికారి శిల్ప, ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సండే.. ఫన్‌డే..

రిలాక్స్ అవుతాం



మేమిద్దరం డాక్టర్లుగా బిజీ లైఫ్ ఉంటుంది. ఆదివారం పిల్లలతో కలిసి ఉండేందుకే టైం కేటాయిస్తాం. వారాని కోరోజు విధులకు దూరంగా ఉండడం వల్ల కాస్త రిలాక్స్ అవ్వొచ్చు. దానికితోడు పిల్లలతో సమ యం కేటాయించడం మూలంగా వారికి ప్రేమను పంచొచ్చు. ప్రతి ఆదివారం వీలైనంత ఎక్కువ సమయం కుటుంబంతోనే గడుస్తుంది. అప్పుడప్పుడు పిల్లలతో కలిసి టూర్లు వెళ్తుంటాం.

– శరత్‌కుమార్, జనరల్ ఫిజీషియన్, కామారెడ్డి

పిల్లల దగ్గరకు వెళ్లాల్సిందే..



వారంలో ఆరు రోజులు పేషెంట్లను చూడడం, కావాల్సిన వైద్యం అందించడంతో బిజీగా గడిచిపోతుంది. కుటుంబానికి సమయం ఇవ్వడం తక్కువే. పిల్లలు చదువుల కోసం హైదరాబాద్‌లో ఉండడం వల్ల వాళ్లను మిస్ అయ్యేవాళ్లం. అందుకే ప్రతి ఆదివారం వాళ్లతో టైం స్పెండ్ చేయడం అలవాటైంది. ఆ రోజంతా వాళ్లతో కలిసి ఉండే ప్రయత్నం చేస్తాం. వీలైతే ఫ్రెండ్స్‌తోనూ టైం స్పెండ్ చేస్తాం.

– కె.నరేందర్‌రావ్, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్, కామారెడ్డి

ఒత్తిడి నుంచి ఉపశమనం



పిల్లలు దగ్గరకి వెళ్లి వాళ్లతో టైం స్పెండ్ చేస్తాను. కుటుంబంతో కలిసి ఉండడం వల్ల ఎంతో రిలాక్స్ అవుతాం. సమయం దొరికితే ఫ్యామిలీ ఫ్రెండ్స్‌ను కలిసి వాళ్లతో కలిసి కాలక్షేపం చేస్తాం. వారానికోరోజు బయటకు కుటుంబంతో, ఫ్రెండ్స్‌తో సమయం కేటాయించడం వల్ల ఒత్తిడి నుంచి ఎంతో ఉపశమనం కలుగుతుంది.

– ఎం.మల్లికార్జున్, డెంటిస్ట్, కామారెడ్డి

ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో..



పిల్లలు చదువుల కోసం హైదరాబాద్‌లో ఉంటారు. ఆదివారం వచ్చిందంటే దాదాపు వారి దగ్గరకు వెళ్లాల్సిందే. వారిని కలిసి ఆ రోజుంతా వాళ్లతో గడపడం ద్వారా వాళ్లకు, మాకు రిలాక్స్ అవుతుంది. సమయం దొరికినప్పుడు ఫ్రెండ్స్‌తోనూ స్పెండ్ చేస్తాను. దగ్గరి బంధువులు, స్నేహితుల ఫంక్షన్లు ఉంటే అటెండ్ అవుతాను.

– రాజశేఖర్‌రెడ్డి, హోమియో వైద్యులు, కామారెడ్డి

వీకెండ్‌లో పిల్లలతో గడుపుతాం



పిల్లలు హైదరాబాద్‌లో చదువుకుంటారు. ఆదివారం వచ్చిందంటే చాలు వాళ్ల దగ్గరికి వెళ్లాలి. పిల్లల్ని తీసుకెళ్లి బయట హోటళ్లలో భోజనం చేయడం, ఆ రోజంతా వాళ్లతో గడిపి వస్తుంటాం. ఒక్కోవారం పేరెంట్స్ దగ్గరకి కూడా వెళ్లి వస్తుంటాను. వారంలో ఒక రోజు రిలాక్స్ అవ్వాల్సిందే. తద్వారా ఒత్తిడిని అధిగమించగలుగుతాం.

– డాక్టర్ శ్రీనివాస్, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు, కామారెడ్డి

కాంగ్రెస్ గూటికి మాజీ సర్పంచులు





కాంగ్రెస్‌లో చేరినవారితో మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రతినిధులు ఆ పార్టీకి షాక్‌లమీద షాక్‌లు ఇస్తున్నారు. దేశాయిపేట్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాస్‌రావు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కోనాపూర్, కొత్తాబాది గ్రామాల తాజామాజీ సర్పంచులు దేశ్‌ముఖ్ వెంకటరమణారావు, అంకిత సాయాగౌడ్‌తోపాటు ఉప సర్పంచ్ ఉస్మాన్, వార్డు సభ్యులు కాంగ్రెస్ గూటికి చేరారు. వీరితోపాటు సోమేశ్వర్, జక్కల్‌దాని తండా, బోర్లంక్యాంపు తదితర గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారందరికీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ అందించేందుకు కృషి చేయాలని మంత్రి వారికి సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతుండడంతో బాన్సువాడ రాజకీయాలు వేడెక్కాయి.

ఘనంగా చక్రతీర్థం



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో నిర్వహిస్తున్న సీతారాముల తిరుక్కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం సీతారాముల వనవిహారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో ఉదయం పూర్ణాహుతి, బలిహరణం, మధ్యాహ్నం గ్రామ శివారులోని మామిడి తోటలో సీతారాముల ఉత్సవ మూర్తులను వన విహారం చేయించారు. వన విహారం సందర్భంగా చక్ర తీర్థం(జాతర), అవభృత స్నానం కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. జాతరలో తిను బండారాలు, ఆట వస్తువుల దుకాణాలు వెలిశాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, సర్పంచ్ గడ్డం రాధకిష్టారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్, వీడీసీ సభ్యులు తోట చిన్న సాయిలు, వారాల సాయిలు, ఆలయ కమిటీ డైరెక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్, భక్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మొక్కు తీర్చుకునేందుకు వచ్చి మృత్యుఒడికి..

- పోచారం ప్రధానకాలువలో పడి ఒకరి మృతి



నాగిరెడ్డిపేట: మొక్కు తీర్చుకునేందుకు వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందిన ఘటన మండలంలోని గోపాల్‌పేటలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట మండలం ఎక్కపల్లికి చెందిన తొర్రి కిషన్(66) గోపాల్‌పేటలో ఉన్న నల్లపోచమ్మ ఆలయంలో మొక్కు తీర్చుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. కాగా ఆలయ సమీపంలోని పోచారం ప్రధానకాలువ పక్కన వంటలు చేసి భుజించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన కిషన్ కాలువలో పడిపోయాడు. గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ మృతి కేసులో ఏడుగురి రిమాండ్

సిరికొండ: మండలంలోని కొండాపూర్‌కు చెందిన పాడెండ్ల లక్ష్మి మృతి కేసులో ఏడుగురిని ఆర్మూర్ కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. లక్ష్మి గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆమె ఫోన్‌ను పరిశీలించగా తన ఆత్మహత్యకు గ్రామానికి చెందిన పలువురు కారణమని వాయిస్ రికార్డు చేసింది. వీడియోలో మృతురాలు పేర్కొన్న పాడెండ్ల చిన్న రాజన్న, పాడెండ్ల పెంటయ్య, పాడెండ్ల రమేశ్, బాలగంగారాం, బొడ్డు రాములు, సుబ్బు మేస్త్రీ, గున్నాల చంద్రయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరు..

బీబీపేట: చోరీ కేసులో ఒకరిని రిమాండ్ చేసినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని యాడారంలో గొబ్బురి బాపురెడ్డి ఇంట్లో ఈ నెల 19న చోరీ జరిగింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్రకాశం జిల్లాకు చెందిన పోకూరి పుల్లయ్య చొరబడి రూ.38 వేలు ఎత్తుకెళ్లాడు. శనివారం యాడారం చౌరస్తాలో పుల్లయ్యను పట్టుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి ద్విచక్ర వాహనం, రూ.రెండు వేలు స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని సోమర్యాగడి తండాలో వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. తండాకు చెందిన బానోత్ కవిత (22) శుక్రవారం రాత్రి తన కూతురితో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాహనాల తనిఖీ

ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధి లోని పలు ప్రధాన రహదారుల్లో శనివారం పోలీసు లు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రా లు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కి తరలించి, యజమానులకు అవగాహన కల్పించినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

- చెరువులో పడి ఇద్దరు చిన్నారుల మృతి
- మిన్నంటిన రోదనలు
- గ్రామంలో విషాదఛాయలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఆంజనేయులు



సుతారి శశాంక్(ఫైల్)



మిద్దెల రవీందర్(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): వారు చిన్ననాటి స్నేహితులు ఎక్కడికి వెళ్లినా, ఆడుకున్నా, పాఠశాలకు వెళ్లినా కలిసే వెళ్లేవారు. కాలనీలో సైతం వారి స్నేహబంధాన్ని చూసి అందరూ మురిసిపోయేవారు. అలాంటి వారి స్నేహాన్ని విధి చిన్నచూపు చూసింది. చెరువులో పడి స్నేహితుడు మునిగిపోవడాన్ని గమనించిన మరో మిత్రుడు కాపాడేయత్నంలో అతనూ నీట మునిగి మృతి చెందిన హృదయ విదారకర ఘటన గాంధారి మండలంలోని ముదెల్లిలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుతారి శశాంక్(9), మిద్దెల రవీందర్(9) స్నేహితులు. వీరు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. వీరు శనివారం తమ బంధువుల ఇళ్లల్లో శుభకార్యానికి వెళ్లడంతో పాఠశాలకు వెళ్లలేదు. మధ్యాహ్నం గ్రామానికి వచ్చిన శశాంక్, రవీందర్, చెల్లి మనీషా టైరు ఆట ఆడుకుంటూ చెరువు కట్ట వద్దకు వెళ్లారు. రవీందర్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువులోకి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. గమనించిన మిత్రుడు శశాంక్ కాపాడే ప్రయత్నం చేసినా అతనూ చెరువులో మునిగి మృతి చెందాడు. చెరువు కట్టపై ఉన్న మనీషా ఈ విషయాన్ని గమనించి తల్లి తండ్రులు, గ్రామస్తులకు తెలిపింది. వెంటనే వారు ఘటన స్థలానికి వెళ్లి చిన్నారులను బయటకు తీశారు. కానీ అప్పటికే వారు మృతి చెందారు. రవీందర్ తండ్రి మిద్దెల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలునుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఇందల్వాయి: ఇందల్వాయి–సిర్నాపల్లి రైలు మార్గంలోని నల్లవెల్లి శివారులో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని రైలు నుంచి గుర్తుతెలియని వ్యక్తి పడి మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ శనివారం తెలిపారు. రైలు పట్టాలపై మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఉదయం ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. ఈ విషయమై రైల్వే పోలీసులకు సమాచారం అందించగా రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కట్నం కోసం వేధిస్తున్న అత్త, భర్తపై కేసు

రెంజల్: అదనపు కట్నం కోసం భర్తతోపాటు అత్త తనను వేధిస్తున్నారని నీలా గ్రామానికి చెందిన లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. 12 ఏళ్ల క్రితం తాడ్వాయికి చెందిన శ్రీనివాస్‌తో లావణ్యకు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. ఇటీవల భర్త శ్రీనివాస్, అత్త అదనపు కట్నం కోసం వేధిస్తుండ డంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బా ధితురాలి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమో దు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై రవికుమార్ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ శనివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చౌటి రాజేశ్, లహరి(27) భార్యాభర్తలు. వీరు స్థానిక లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నారు. రాజేశ్ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కి వెళ్లి మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. శనివారం మధ్యాహ్నం రాజేశ్ బయటకు వెళ్లి వచ్చే సరికి లహరి ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. లోపలి నుంచి గడియ ఉండడంతో రాజేశ్ లహరిని ఎంతసేపు పిలిచినా పలకపోవడంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులను బద్దలగొట్టి చూడగా లహరి చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతురాలి తల్లి నర్రా సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

ఆర్మూర్‌టౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఇస్సాపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గామ్ నవీన్ (32) బతుకుదెరువు కోసం మస్కట్ వెళ్లి ఏడు నెలల క్రితం తిరిగి వచ్చాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. గగ్గుపల్లి శివారులోని చెట్టుకు ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా నవీన్ మృతదేహంగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లిదండ్రులు మందలించినందుకు..

మాక్లూర్: ఏ పని చేయకపోతే ఇల్లు ఎలా గడుస్తుందని తల్లిదండ్రులు మందలించినందుకు ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మాక్లూర్ మండలం ఒడ్డెట్‌పల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మచ్చ నిఖిల్(29) ఏ పని చేయకుండా జులాయిగా తిరిగేవాడు. పెళ్లి చేస్తే మార్పు వస్తుందేమోనని తల్లితండ్రులు పది నెలల క్రితం వివాహం జరిపించారు. ప్రస్తుతం నిఖిల్ భార్య గర్భిణి. ఈ క్రమంలో శుక్రవారం పనిపాట లేకుండా తిరిగితే కుటుంబం ఎలా గడుస్తుందని ఇంట్లో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన నిఖిల్ ఇంట్లో అందరు పడుకున్నాక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.